
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

శనివారం 14 డిసెంబరు 2024



నయనానందం

సంధ్య వేళలో పడమరన అస్తమించే సూర్యుడిని చూస్తే ప్రకృతి ప్రేమికులు ఎవరైనా పరవశించి పోతారు. సూర్యాస్తమయ సమయంలో రావిరాల గ్రామ సమీపంలో చెట్ల కొమ్మలకు విరబూసిన పువ్వులా భానుడు కనువిందు చేశాడు. సింధూరపు రంగులు వెదజల్లుతూ మరుసటి రోజు వేకువజామున తిరిగి వస్తానని కనుమరుగయ్యాడు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా



రైతు అమర్‌నాథ్‌రెడ్డికి సూచనలు చేస్తున్న డీఏవో నర్సింహారావు

వరి కొయ్యలను కాల్చొద్దు

- పొలంలోనే కలియదున్నాలి
- జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

కేశంపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కోతల అనంతరం వరి కొయ్యలను కాల్చ వద్దని, పొలంలోనే కలియదున్నాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు సూచించారు. శుక్రవారం కేశంపేట మండలం లేమామిడి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. చాలామంది రైతులకు అవగాహన లేక వరి కొయ్యలను కాల్చడం కారణంగా వాతావరణం కలుషితం కావడమే కాకుండా, వ్యవసాయానికి ఉపయోగపడే మిత్రపురుగులు, సూక్ష్మజీవులు అంతరించిపోయే ప్రమాదముందని తెలిపారు. భూమిలో సేంద్రియ కర్బనం 30 నుంచి 40 శాతం వరకు తగ్గే అవకాశాలు ఉన్నాయన్నారు. దీంతో వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం పెరుగుతుందని వివరించారు. కొయ్యలను భూమిలోనే కలియదున్నడంతో సేంద్రియ భూసారం పెరుగుతుందన్నారు. నత్రజని, బాస్వరం, పొటాష్, జింక్ లవణాలు భూమిలోనే ఉండిపోయి మొక్కలకు సమృద్ధిగా అందుతాయని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీష, ఏఈవో సుధ, రైతులు అమర్‌నాథ్ రెడ్డి, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

స్లాబ్‌కే పరిమితం

- అసంపూర్తిగా వ్యవసాయ శాఖ అదనపు గదుల నిర్మాణం
- 20ఏళ్లుగా పూర్తి చేయని పనులు
- ఇబ్బందుల్లో రైతులు, అధికారులు



8

సమస్యలపై కార్మికుల ఆందోళన

- శంషాబాద్ కార్మిక శాఖ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికుల ధర్నా
- హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు



7

జాతరకు వేళాయే..

- గౌతాపూర్ గ్రామ మల్లికార్జున స్వామి ఆలయంలో వేడుకలు
- మూడు రోజులపాటు కొనసాగింపు
- రేపు బోనాల కార్యక్రమం



7

రోడ్డు విస్తరణపై ట్రిబ్యునల్‌లో వాదనలు

- హైదరాబాద్ - బీజాపూర్ హైవే కేసు తుది తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు
- చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ వెల్లడి

చేవెళ్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణకు సంబంధించిన కేసుపై చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో వాదనలు జరిగాయని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బీజాపూర్ జాయతీ రహదారి (ఎన్‌హెచ్ -163) రోడ్డు విస్తరణకు సంబంధించిన కేసు (ఓఏ 262 /2024) తేజా బాలాంత్రపు వర్సెస్, కేంద్ర పర్యావరణ శాఖ పరిధిలో ఉందన్నారు. అయితే ఈ కేసుకు సంబంధించి చెన్నైలోని జాతీయ ట్రిబ్యునల్ (దక్షిణ బెంచ్) ఎదుట శుక్రవారం వాదనలు ముగిశాయన్నారు. రాష్ట్రప్రభుత్వ నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్డు విస్తరణకు ఆలస్యం కావడం వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, సంభవిస్తున్న ప్రాణ నష్టం వివరాలు ట్రిబ్యునల్ ఎదుట వాదనలు వినిపించారని చెప్పారు. కాగా వాదోపవాదాలు విన్న కోర్టు తుది తీర్పును రిజర్వ్ చేసిందని స్పష్టం చేశారు. అయితే నేషనల్ హైవే విస్తరణకు సంబంధించిన ప్రాథమిక రోడ్డు పనులు మాత్రం చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు.

మల్కీజ్‌గూడ బుక్ కీపర్‌పై కేసు

- విచారించిన పోలీసులు

యాచారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలంలోని మల్కీజ్‌గూడలో డ్వాక్రా సంఘాలలో నిధుల దుర్వినియోగంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుక్‌కీపర్ రాణిపై యాచారం పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. డబ్బు దుర్వినియోగం సమయంలో గ్రామంలో జరిగిన పరిస్థితులపై పోలీసులు ఆరా తీశారు. గ్రామంలో రూ.63లక్షల మేర నిధులు దుర్వినియోగమైనట్లు బ్యాంక్ అధికారులు, సెర్ప్ అధికారుల విచారణలో తేలిందని తెలిపారు. కాగా నిధులు దుర్వినియోగంపై ఇద్దరు డీపీఎంలో విచారణ చేయిస్తున్నట్లు డీఆర్‌డీవో పీడీ శ్రీలత వివరించారు. నిష్పక్షపాతంగా విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం చేసి ఆదుకుంటామని డీఆర్‌డీవో పీడీ శ్రీలత చెప్పారు.

ఇసుక ఫిల్టర్లు ధ్వంసం

ఆమనగల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక ఫిల్టర్లపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలోని వ్యవసాయ పొలాల వద్ద ఫిల్టర్లు ఏర్పాటు చేసి కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. ఈ మేరకు తహసీల్దార్ లలిత ఆదేశానుసారం రెవెన్యూ, పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన పర్వతాలు, గణేశ్ నిర్వహిస్తున్న ఇసుక ఫిల్టర్లను జేసీబీ సాయంతో ధ్వంసం చేశారు. అక్రమంగా ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ వెంకటేశ్ హెచ్చరించారు. దాడుల్లో ఆర్‌ఐలు చెన్నకేశవులు, ప్రొబెషనరీ ఎస్‌ఐ శేఖర్, పీసీలు మల్లేశ్, ఇబ్రహీం ఉన్నారు.



కొన్నది కొంతే!

తుది దశకు ధాన్యం సేకరణ

- లక్ష్యం 40వేల మెట్రిక్ టన్నులు
- సేకరించింది 7,310 టన్నులు
- నెలాఖరు వరకు 2 వేల టన్నులు రావచ్చని అంచనా

జిల్లాలో ధాన్యం సేకరణ అంతంత మాత్రంగా సాగింది. లక్ష్యం కొండంత ఉండగా.. సేకరించింది మాత్రం గోరంత అన్న చందంగా ఉంది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. కేంద్రాల్లో పెట్టే కొర్రీలు పడలేక రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని అమ్ముకున్నారు. కొనుగోళ్లు ఆఖరి దశకు చేరుకోవడంతో ఈ సారి కూడా లక్ష్యానికి సమీపంలోకి వెళ్లే పరిస్థితి కూడా కనిపించడం లేదు.

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. జిల్లాలో కొండంత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా.. సేకరించింది మాత్రం గోరంతే. వరి దిగుబడి ఆశించిన మేర వచ్చినా? సేకరణలో అధికారులు విఫలమయ్యారు. కొనుగోలు కేంద్రాల కంటే ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ ధర కల్పించడం, కొనుగోళ్లలో షరతులు విధించక పోవడం, అమ్మిన వెంటనే డబ్బులు చెల్లించడం వంటి కారణాలతో రైతులు కొనుగోలు కేంద్రాలపై ఆసక్తి చూపలేదు. కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించకపోవడం,

మిగతా 8వ పేజీలో...

ధాన్యం అమ్మిన రైతుల సంఖ్య

	దొడ్డు రకం	సన్నరకం	మొత్తం
ఐకేపీ	43	69	112
పీఏసీఎస్	471	470	941
డీసీఎంఎస్	291	160	451
మొత్తం	805	699	1,504

కొనుగోళ్ల వివరాలు

కేంద్రాలు	ఐకేపీ
42	03
పీఏసీఎస్	డీసీఎంఎస్
31	08

రైతులు :1,504

సేకరించిన ధాన్యం

మొత్తం 7,310 మెట్రిక్ టన్నులు

గ్రేడ్-ఏ 7,285 మెట్రిక్ టన్నులు

కామన్ రకం 25 మెట్రిక్ టన్నులు

ఎన్నిక



సామిల్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా విజయ్‌కృష్ణ

ఆమనగల్లు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సామిల్స్, టింబర్ మర్చంట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆమనగల్లుకు చెందిన కౌన్సిలర్ తల్లోజు విజయ్‌కృష్ణ ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్ బాలాపూర్‌లో సామిల్స్, టింబర్ మర్చంట్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రమణయ్య, జిల్లా అధ్యక్షుడు సూదిని రంగారెడ్డి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా విజయ్ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం విజయ్‌కృష్ణకు రంగారెడ్డి నియామక పత్రాన్ని అందజేసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కట్టెకోత మిషన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పోతెపల్లి రాజు, తల్లోజు మాధవాచారి, చెన్నోజు పుల్లయ్యచారి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు

మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం స్థానిక మార్కెట్ యార్డులో జరుగనుంది. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని మార్కెట్ కమిటీ వర్గాలు తెలిపాయి.

కంకర పరిచారు.. బీటీ మరిచారు!

నత్తనడకన ఆగాపల్లి-మంచాల బీటీ రోడ్డు విస్తరణ

- రెండేళ్లుగా పూర్తికాని నిర్మాణ పనులు
- రహదారి పక్కన అడ్డగోలుగా కంకర కుప్పలు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



మంచాల-జాపాల రహదారిపై కంకర కుప్పలు

మంచాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆగాపల్లి-మంచాల బీటీ రోడ్డు విస్తరణ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండేళ్ల కాలవ్యవధిలో రెండు ప్రభుత్వాల పాలనలో ఈ బీటీ విస్తరణకు శంకుస్థాపనలు జరగడం గమనార్హం. రెండేళ్లవుతున్నా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. ఆగాపల్లి నుంచి కాగజ్‌ఘట్ జాపాల మీదుగా మంచాల వరకు సుమారు 9 కిలోమీటర్ల మేర ఈ బీటీ విస్తరణకు గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించారు.

ఈ రహదారి విస్తరణ కోసం రెండు విడతలుగా నిధులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వం రూ.2.15 కోట్లు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ఇప్పుడున్న రోడ్డుకు రెండువైపులా మూడు ఫీట్ల మేర విస్తరించాల్సి ఉంది. ఆ తదుపరి మొత్తంగా 9 కిలోమీటర్ల మేర బీటీ విస్తరణ చేయాలి. కానీ ఇప్పటికీ రహదారి వెడల్పు పనులే పూర్తికాలేదు. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా పోసిన కంకర కుప్పలు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డుపై పరిచిన కంకర, ఇసుకలో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కిందపడే పరిస్థితి నెలకొంది. నిధులు విడుదల చేయకపోవడంతోనే రోడ్డు పనులు ఆగినట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. కనీసం గతంలో చేసిన పనులకు రొటేషన్ పద్ధతిలోనైనా నిధులు విడుదల చేయాలని, పాత బిల్లులు ఇవ్వకుండా కొత్త పనులు ఎలా చేస్తామని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి మంచాల-ఆగాపల్లి బీటీ విస్తరణ సత్వరమే పూర్తి చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం

ఆగాపల్లి-మంచాల బీటీ విస్తరణ కోసం మంజూరు చేసిన నిధులు ఇంకా విడుదల కాలేదు. నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. ఎలాగైనా పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- అబ్బాస్, డీఈ, ఆర్‌అండ్‌బీ

శ్మశాన వాటికను యధావిధిగా నిర్మించాలి

- తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- బాసగూడ తండావాసుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గిరిజనులు

మహేశ్వరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపాలిటీలోని బాసగూడ తండాలో శ్మశాన వాటికను కూల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్మశాన వాటిక వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 9, 10లోని 20గుంటల ప్రభుత్వ భూమిలోని శ్మశాన వాటికను ఓ రియల్ వ్యాపారి అండదండలతో మంఖాల్‌కు చెందిన కొందరు జేసీబీలతో తొలగించారన్నారు. వారిపై చర్యలు తీసుకొని, శ్మశాన వాటికను యధావిధిగా నిర్మించాలని అన్నారు. కౌన్సిలర్ రవినాయక్, శ్రీనివాస్, భాస్కర్, గిరిజనులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేసింది గోరంత.. చెప్పుకునేది కొండంత

- ఎమ్మెల్యే సబిత
- వ్యవసాయ శాఖ కార్యాలయం తనిఖీ



మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్యతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతు రుణమాఫీ చేసింది కొంతయితే.. ప్రచారం మాత్రం కొండంత చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. నాలుగు విడతల్లో ఎంత మంది రైతులకు రుణమాఫీ అయ్యిందని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 50శాతం రైతులకు కూడా రుణమాఫీ చేయకుండా రైతు సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీఎం రేవంత్ ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. నాలుగు విడతలుగా రుణమాఫీ డబ్బులు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పూర్తిస్థాయిలో రైతుల ఖాతాల్లో వేయడంలేదన్నారు. మండలంలో ఎంతమంది పంటరుణం తీసుకున్నది, ఎందరికి రుణమాఫీ అయ్యిన సమాచారం వ్యవసాయశాఖ అధికారుల వద్ద లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల పేరిట ఇచ్చిన 420హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ ఎస్.సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి లావణ్య, ఏఈవోలు రాజు, శ్రీహరి, నాయకులు ఎలుక మేఘనాథ్‌రెడ్డి, ఎస్ సుదర్శన్‌రెడ్డి, తాళ్ల కార్తీక్, కె.ప్రశాంత్ చారి. జి.కొండల్ రెడ్డి, కె.జంగయ్య. గాదె రవీందర్, టంకరి ఉమాకాంత్‌రెడ్డి, గంగుల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో ప్లాట్ స్వాహా

నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం పెట్టి ఇతరుల ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటనలో నిందితులను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన కిరణ్ తివారీ తన భర్త దీపక్ తివారీతో కలిసి షాద్‌నగర్‌లోని ఆర్టీసీ కాలనీలో ఉంటున్నారు. ఇదే ప్రాంతంలోని పరిశ్రమల్లో పనిచేస్తూ ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం శివారులోని 'బిల్డింగ్ బ్లాగ్స్' అనే రియల్ వెంచర్‌లో 2013లో సర్వే నంబర్ 115, 117, 118లలో ప్లాట్ నంబర్ 1297లో 133గజాల స్థలం కొన్నారు. కాగా హైదరాబాద్‌కు కాళీ కమాన్‌కు చెందిన గోపాల్, మీర్‌ఆలం మండికి చెందిన దర్గా గోపీశ్వర్, టిల్లు అనే వ్యక్తులు కిరణ్ తివారీ చనిపోయారని నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. వారిపై ఆస్తికి దీపక్ తివారీ వారసుడని తప్పుడు లీగల్ హెయిర్ సర్టిఫికెట్ తీసుకున్నారు. రెండు దొంగ సర్టిఫికెట్లతో ఆస్తి బదిలీ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్నారు. అశోక్ అలియాస్ టిల్లు అనే వ్యక్తిని దీపక్ తివారీగా చూపి 2021లో గోపాల్ పేరిట ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించారు. డాక్యుమెంటేషన్‌ను విజయ్ అనే వ్యక్తి చేశాడు. ఇదే ఆస్తిని 2022లో ముఠాలోని గోపీశ్వర్ పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. సాక్షులుగా హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ జమీల్, షాబాద్ మండలం బోనగిరిపల్లికి చెందిన లింగాల విజయ్‌లను పెట్టారు. వీరి మోసాన్ని గ్రహించిన బాధితురాలు కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. టిల్లు పరారీలో ఉన్నాడన్నారు. ఈ ఆస్తి రిజిస్ట్రేషన్‌లో అప్పటి సబ్‌రిజిస్ట్రార్ సతీష్ పాత్రపైనా విచారణ చేస్తున్నామని ఆయన వివరించారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

అయ్యప్పస్వాములకు బిక్ష ఏర్పాటు చేసిన ముస్లిం


కులకచర్లలో అయ్యప్ప స్వాములకు భోజనం వడ్డిస్తున్న రుక్మోద్దీన్

కులకచర్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా సోదరభావంతో ఓ ముస్లిం అయ్యప్పస్వాములకు బిక్ష (భోజనం) ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. వికారాబాద్ జిల్లా కులకచర్ల మండల పరిధిలోని అయ్యప్ప కొండపై గల దేవాలయంలో అయ్యప్పస్వాములకు శుక్రవారం కులకచర్ల గ్రామానికి చెందిన ముస్లిం రుక్మోద్దీన్ సొంత డబ్బుతో బిక్ష ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా రుక్మోద్దీన్‌ను అయ్యప్పస్వాములు సన్మానించారు. అయ్యప్పస్వాములకు భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సౌమ్యారెడ్డి, ఆలయ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా బంద్



మోమిన్‌పేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ సేవలను సాంకేతిక కారణాల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేస్తున్న తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తెలిపారు. ఈ నెల 16 వరకు ధరణి సేవలు ఉండవని తెలిపారు. ధరణి పోర్టల్ డాటాబేస్ వెర్షన్ అప్‌గ్రేడ్ చేస్తుండటంతో ఈ అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు భూ సమస్యలు, రిజిస్ట్రేషన్లు కొనసాగవని తెలిపారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు


పూజల్లో ఆలయ చైర్మన్ పవన్‌కుమార్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి

తలకొండపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాంపూర్ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ చైర్మన్ జిల్లెల పవన్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల రెండో రోజు శుక్రవారం ధ్వజారోహణం, అభిషేకపూజలు నిర్వహించారు. శనివారం నాటి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎంపీ ఎం.రవి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, అర్చకులు నర్సింహాచారి, ఆలయ కమిటీ వైస్‌చైర్మన్ అమృత, డైరెక్టర్లు స్వామిగౌడ్, వెంకటయ్య, యాదయ్య, జంగిలి, నాయకులు హరిమోహన్‌రెడ్డి, శేఖర్, ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్


కమిటీ అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదని బీజేపీ మండల అధ్యక్షుడు మన్యనాయక్, దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నింగ్యారి యాదగిరి, మండల ప్రధాన కార్యదర్శి డి.మహేశ్ అన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసం అని మరోసారి రుజువైందన్నారు. మక్తమాదారంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, బూత్ కమిటీల ఏర్పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. 4వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా బొల్లం మురళి, ఐదో బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఎ.రమేశ్‌లను నియమించారు. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. సమావేశంలో ప్రభాకర్‌గౌడ్, నరేశ్, శంకరయ్య, రాందాస్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జీపీ బోరు నీటితో కల్లు తయారీ


కల్లు దుకాణానికి వాడుతున్న పంచాయతీ బోరు

చౌదరిగూడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడలోని 8వ వార్డులో పంచాయతీ బోరును ప్రైవేట్ వ్యక్తులు వ్యాపారానికి వినియోగిస్తున్నారు. గతంలో ఈ బోరు నీటిని కాలనీ వాసులు వినియోగించుకునేవారు. ఇప్పుడు ఓ వ్యక్తి ఈ బోరు నుంచి కల్లు కాంపౌండ్‌కు పైప్‌లైన్ వేసుకొని వాడుకుంటున్నాడని కాలనీవాసులు చెబుతున్నారు. ఈ బోరుకు పైప్‌లైన్ తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. మరో బోరును మాజీ సర్పంచ్ పంచాయతీ వాటర్ ఫిల్టర్‌కు వినియోగిస్తున్నాడని ఆరోపణలున్నాయి. వీటిపై పంచాయతీ కార్యదర్శి స్పందన కోరగా ఇంటి యజమానికి నోటీసులిచ్చామని, పంచాయతీ బోరును ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తా


ఎంపీ మల్లురవిని సన్మానిస్తున్న కేశవులు

ఆమనగల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. ఆమనగల్లులో ఆర్డీవో, ఎస్టీవో, సబ్‌రిజిస్ట్రార్, ఏసీపీ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఆమనగల్లు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు శుక్రవారం ఢిల్లీలో రవిని కలిసి వినతిపత్రమిచ్చారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం, జిల్లా పరిషత్ పాఠశాల వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి చిరు వ్యాపారులకు సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే షాబాద్‌లో కొనసాగుతున్న ఆమనగల్లు గురుకుల పాఠశాలకు ఆమనగల్లులో భవనాన్ని నిర్మించాలన్నారు. జూనియర్, డిగ్రీ కాలేజీలకు భవనాలు నిర్మించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి రవి సానుకూలంగా స్పందించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోతానని చెప్పారని కేశవులు పేర్కొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు



తాండూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టనున్నట్లు అడిషనల్ ఎస్పీ హనుమంత్‌రావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో శాంతిభద్రతలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, నాయకులు అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



స్పీకర్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

దోమ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 52వ జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా వికారాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతులు సాధించారు. 'వనరుల నిర్వాహణ' అనే అంశంపై దోమ మండలంలోని దాదాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి దయాకర్, సిరిధాన్యాలు అంశంలో అక్షయ ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. వీరికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు శాంతకుమార్, ఫేరోజ్‌లను హెచ్ఎం అమర్‌నాథ్ అభినందించారు.

పూడూరు: జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జడ్పీహెచ్ఎస్ కంకల్, పూడూరు విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన శ్రీనిధి, వైష్ణవిలు జిల్లాస్థాయి రెండోస్థానంలో నిలిచారు. వీరికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ బహుమతులు అందజేశారు. గైడ్ టీచర్ మహేశ్వరి, జీహెచ్ఎం పుష్ప, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాసంగి 2022-23, వానాకాలం 2023-24 సంవత్సరాలకు సంబంధించి సీఎంఆర్ ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వానికి ఇవ్వాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా మిలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సీఎంఆర్ ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వానికి ఇవ్వాలని ఆదేశించారు. లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతే కాకుండా వానాకాలం 2024-25 సంవత్సరానికి సీజన్‌కు సంబంధించి వరిధాన్యం సన్నవడ్లు, దొడ్డు వడ్లు కొనుగోలు కేంద్రాల నుంచి దిగుమతి చేసుకోవాలని కోరారు. దిగుమతి చేసుకున్న ధాన్యాన్ని వెంటనే రసీదు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో మోహన్ బాబు, డీఎంసివిల్ సప్లయ్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా రాజశ్యామల యాగం



రాజశ్యామల యాగంలో శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్

తలకొండపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వెల్జాల వేదాద్రిగుట్టపై గల ప్రసిద్ధ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం రాజశ్యామల యాగాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ సంగీతల ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పండితులు గూడ యాదగిరి, నర్సింహ్మయ్యశర్మ, శ్రీనివాసమూర్తి, మురళీధరశర్మ, శరత్‌చంద్రశర్మల ఆధ్వర్యంలో యాగాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని యాగాన్ని నిర్వహించామని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, అంబాజీ, రవికుమార్, బి.వెంకటయ్య, మురళీధర్, లింగంగౌడ్, రాములు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సౌకర్యాలకు పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీలో సౌకర్యాలు కల్పించేందుకు పెద్దపీట వేస్తున్నట్లు చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ ఏరోస్పేస్ ప్రాజెక్టులో టీసీఎస్, హెలీకాప్టర్ విడిభాగాల తయారీ యూనిట్, పలు దిగ్గజ సంస్థలు నడుస్తున్నాయన్నారు. బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఆదిభట్ల టీసీఎస్ వరకు ఉన్న రోడ్డుకు రతన్‌టాటా మార్గ్‌గా నామకరణం చేయాలని కౌన్సిల్ తీర్మానించింది. అలాగే ఆదిభట్ల వద్ద రతన్ టాటా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుకు కూడా తీర్మానించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో తప్పులు దొర్లకుండా నిరేపేదలనే ఎంపిక చేయాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నార్సింగి ఏఎంసీ డైరెక్టర్‌గా శ్రీకాంత్‌గౌడ్




ఏఎంసీ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న అనెగౌని శ్రీకాంత్‌గౌడ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండకు చెందిన నాయకుడు అనెగౌని శ్రీకాంత్‌గౌడ్ రెండోసారి నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అనంతరం శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా మార్చేలా కృషిచేస్తానన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ కోట వేణుగౌడ్, మాజీ సర్పంచ్ ఆర్.గణేశ్‌గుప్తా, నాయకులు చంద్రారెడ్డి, మాజీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ సుష్మామహేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ గోపాల్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు, మాజీ వైస్‌ఎంపీపీ నీలా మోహన్, చిన్న గోల్కొండ ప్యాక్స్ చైర్మన్ దవనకర్‌గౌడ్, పెద్దగోల్కొండ మాజీ సర్పంచ్‌లు అనెగౌని నర్సింహగౌడ్, మాజీ ఎంపీటీసీలు సరిత, రవీందర్, ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

మూడుచింతలపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు పౌష్టికాహారం అందించడమే హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ కంపెనీ లక్ష్యంగా ముందుకు సాగుతోందని సీఎస్ఆర్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కేశవరం గ్రామ పరిధిలో ఉన్న సూపర్‌సంగీత్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం భగీరథ బాలల వికాస కేంద్రం 16వ వార్షికోత్సవ సంబురాలు నిర్వహించారు. రోజూ 28 అంగన్‌వాడీ సెంటర్లలోని 550 పిల్లలకు 160 ఎమ్ఎల్ పాలు, అరటిపండు, మిల్లెట్, చిక్కితో పాటు వారికి అవసరమైన వస్తువులను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ జనరల్ మేనేజర్ హనూష్ సూర్యనేని, కిరణ్, కృష్ణప్రసాద్, ఆంజనేయులు, శ్రీధర్, సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి జాతర ప్రారంభం



గౌతాపూర్ గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి ఆలయం

- గౌతాపూర్‌లో మూడురోజుల పాటు ఉత్సవాలు
- రేపు బోనాలు



మల్లికార్జునస్వామి

తాండూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌతాపూర్ గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి జాతరోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే ఉత్సవాలకు తాండూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు. జాతరకు సంబంధించి ఇప్పటికే ఆలయ నిర్వాహకులు పూజారి పత్తి చంద్రయ్యస్వామి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గతేడాది గ్రామస్తుల సహకారంతో నూతనంగా పెద్ద ఆలయాన్ని నిర్మించారు. ఈ ఏడాది స్వామివారికి నాగాభరణం చేయించారు.

మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాలు

నేడు(శనివారం) సాయంత్రం స్వామివారి భజన కార్యక్రమాలతోపాటు ఆదివారం(రేపు) ఉదయం గంగాస్నానం, మధ్యాహ్నం 2.30గంటలకు స్వామివారి ఊరేగింపుతో ఆలయానికి రావడం, సాయంత్రం వాడవాడల నుంచి బోనాల ఊరేగింపు రాత్రి 9గంటలకు స్వామివారి ఒగ్గుకథ, 16వ తేదీన సోమవారం ఉదయం 9.30గంటలకు స్వామివారి పల్లకితో ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ మెంబర్ మల్క్యాడ్ రమేష్ హాజరుకానునట్లు ఆలయపూజారి పత్తి చంద్రయ్య తెలిపారు. ఈ కార్యక్రమాలకు గ్రామపెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.



మల్లికార్జునస్వామికి అలంకరించిన నాగాభరణం

పురుగుల బియ్యం వస్తే వెనక్కి పంపాలి



బియ్యాన్ని పరిశీలిస్తున్న వాసుచంద్ర

ధారూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పురుగుల బియ్యం స్టాక్ వస్తే వాటిని వెంటనే వెనక్కి పంపించాలని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర కేజీబీవీ సిబ్బందికి సూచించారు. ధారూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన విద్యాలయంలో నిల్వఉంచిన బియ్యం, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రోజూ కోడి గుడ్డు ఎందుకు పెట్టలేదని టీచర్లను ఆయన ప్రశ్నించగా కాం ట్రాక్టర్ గుడ్లను సరఫరా చేయలేదని సి బ్బంది తెలిపారు. రోజూ మెనూలో గుడ్లు, పండ్లు సక్రమంగా ఇవ్వటం లేదని విద్యార్థినులు ఆర్డీవో దృష్టికి తీసుకురాగా ఇక ముందు తరుచూ విద్యాలయాన్ని సందర్శిస్తామని మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం పెట్టాల్సిందేనని ఆదేశించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సాజిదా బేగం, ఎంపీడీవో నర్సింహులు, ఎంపీవో షఫీఉల్లా ఉన్నారు.

అడ్డు తొలగించుకునేందుకే మహిళపై హత్యాయత్నం



నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

పూడూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు మహిళపై హత్యాయత్నం చేసిన ఘటనకు సంబంధించిన కేసును పోలీసులు ఛేదించారు. అడ్డుతొలగించుకోవాలనే ఉద్దేశంతోనే మహిళ హత్యాయత్నం చేశారని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ మధుసూదనరెడ్డితో కలిసి శుక్రవారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి డీఎస్పీ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ బండ్లగూడ ప్రాంతానికి చెందిన బీబీ ఫాతిమా భర్త ఎనిమిదేళ్ల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆమెకు ఇద్దరు కుమారుడు ఉండగా వారి వివాహాలు అయ్యాయి. అప్పటి నుంచి ఆమె బండ్లగూడ చంద్రయాన్‌గుట్టలో కూలి పనులు చేసుకుంటూ ఒంటరిగానే ఒక గదిలో అద్దెకు ఉంటోంది. ఆమె ఇంటి పక్కనే సాగొల్ల రాజ్‌కుమార్ అనే వ్యక్తి కూడా అద్దెకు ఉంటున్నాడు. అయితే బీబీ ఫాతిమా, రాజ్‌కుమార్ మధ్య పరిచయం పెరిగి వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఈ విషయం రాజ్‌కుమార్ కుటుంబసభ్యులకు తెలిసి ఆయన భార్య, కొడుకుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. అదేవిధంగా బీబీఫాతిమా కూడా తనను వివాహం చేసుకోవాలని రాజ్‌కుమార్‌ను పలుమార్లు కోరగా కొప్పుకోలేదు. ఎలాగైనా ఈమెను వదిలించుకుని కుటుంబంతో హాయిగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో రాజ్‌కుమార్, మరో వ్యక్తి సాగొల్ల ప్రభు(శ్రీను) తో కలిసి పతకం పన్నారు. బీబీఫాతిమాను సిటీలో అయితే గుర్తుపడతారని మన్నెగూడ వరకు బస్సుకు వచ్చి అక్కడ దిగారు. అనంతరం వికారాబాద్ రోడ్డుకు కొంతదూరంలో ఉన్న మామిడి తోట గేట్లు తెరిచి ఉండటంతో ఆమెను అక్కడికి తీసుకువచ్చారు. అక్కడ ముగ్గురు కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులోకి జారుకున్న బీబీ ఫాతిమాను రాజ్‌కుమార్, సాగొల్ల ప్రభు కలిసి గొంతు కోశారు. అనంతరం ఆమె మృతిచెందినట్లు భావించి, ఆమె వద్ద ఉన్న బురఖా, ఆధార్ కార్డు, పర్సు, మద్యం బాటిళ్లను ఆధారాలు దొరకకుండా కాల్చేశారు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న వస్తువులను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఐదు బృందాలను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నారు. 13వ తేదీన విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులను పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.300, చాకు, దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

కొనసాగుతున్న సీఆర్పీల సమ్మె

మూతబడిన మండల విద్యాధికారి కార్యాలయం



సీఆర్పీల సమ్మెతో మూతబడిన విద్యాధికారి కార్యాలయం

తాండూరు రూరల్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండల విద్యాధికారి కార్యాలయంలో తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న సీఆర్పీలు, ఎంఐఎస్‌ల సమ్మె శుక్రవారంతో వారం రోజులకు చేరింది. దీంతో తాండూరు మండల పరిషత్ కార్యాలయం మూతబడింది. తాండూరు మండల ఎమ్మార్సీఎస్‌లో ముగ్గురు సీఆర్పీలు, ఒక ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, ఏడుగురు సీఆర్పీలు, ఒక డీఈవో(డాటా ఎంట్రీ ఆపరేటర్), ఒక మెసేంజర్ తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు వారం రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వం వీరి సమస్యలను పట్టించుకోకపోవడంతో సమగ్ర శిక్షా ఉద్యోగులంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో సమ్మె బాటపట్టారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వారికి అవస్థలు తప్పడం లేదని ఎంఐఎస్ తాత్కాలిక ఉద్యోగి శ్రీనివాస్ ఆవేదవ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని వారు కోరారు.

హర్యానాయక్‌కు మెరుగైన చికిత్స అందించాలి



ధర్నా నిర్వహిస్తున్న తండావాసులు

బొంరాస్‌పేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో అరెస్టయి జైలులో ఉన్న హర్యానాయక్‌కు మెరుగైన చికిత్స అందించి వెంటనే విడుదల చేయాలని గిరిజన మహిళలు ధర్నా నిర్వహించారు. లగచర్ల గేటుపై రోటిబండ తండా వద్ద పులిచర్ల కుంట, రోటి బండ తండా గిరిజన మహిళలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. లగచర్ల ఘటనలో అక్రమంగా అరెస్టయిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఇంకా ఎంత మంది అనారోగ్యంతో ఉన్నారో తమకు సమాచారం లేదని, వారిని విడుదల చేసి వారికి చికిత్స అందించాలని కోరారు. లగచర్ల ఘటనలో అరెస్టయిన వారికి ఏదైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అరెస్టుల కారణంగా రెండు తండాలతో పాటు గ్రామాల్లో కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని సముదాయించి ధర్నాను విరమింపజేశారు. ధర్నాలో అరెస్టయిన వారి కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.

షాపూర్‌లో తాగునీటి తంటాలు



తాగునీటి కోసం బోరు దగ్గర గూమిగూడిన షాపూర్ గ్రామస్థులు

మర్పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): షాపూర్ గ్రామస్థులు వారం రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కాకపోవడంతో గ్రామంలో ఉన్న రెండు బోర్ల ద్వారా గ్రామస్థులు తాగునీటిని తీసుకెళ్తున్నారు. ఆ రెండు బోర్లలో ఓ బోరు మోటారు వారం రోజుల కిందట చెడిపోగా ఇంత వరకు మరమ్మతులు చేయించలేదు. దీంతో గ్రామస్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరుమోటార్ మరమ్మతులు చేయాలని అధికారులకు వివరించినా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బోరులో నీరు పుష్కలంగా లేకపోవడంతో గంటల తరబడి వేచిఉండాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సేవలందిస్తాం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల స్థాయిని పెంచి రోగులకు మెరుగైన సేవలందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాడ్గుల పీహెచ్‌సీని పది పడకల నుంచి 30 పడకలకు పెంచేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. మాడ్గుల ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం కేటాయించిన 108 అంబులెన్స్‌ను శుక్రవారం ఆమనగల్లు మార్కెట్ చైర్పర్సన్ యాట గీతనర్సింహ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సుధామాధవి, మాజీచైర్మన్ బట్టు కిషన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అంబులెన్స్‌ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. మాడ్గుల మండలాన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, పల్లె జంగయ్య, రమేశ్, సంపత్‌కుమార్, యాదయ్య, పాండుగౌడ్, విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, వైద్యులు శిల్ప, మోహన్, ఎంపీడీవో పద్మావతి, మిద్దె రాములు, జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్యగౌడ్, జంగయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, విజయరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ

ఆమనగల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ అన్నారు. రైతులకు మార్కెట్‌లో మెరుగైన వసతులు కల్పించి ఆదాయాన్ని పెంచేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ తొలి సమావేశం శుక్రవారం మార్కెట్ కార్యాలయంలో నిర్వహించారు. చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మార్కెట్‌కు నూతన పాలకవర్గాన్ని నియమించిన ప్రభుత్వం, సీఎంరేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే నారాయణ రెడ్డిలకు ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రైతుల విశ్రాంతి భవనం ఆధునీకరణ, ప్రహరీ మరమతులు, కడ్తాలలో సబ్ మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు సమావేశంలో తీర్మానం చేశారు. మార్కెట్ ఆవరణలో నిర్మించిన 8 దుకాణాలను స్వాధీనం చేసుకొని ప్రారంభించేందుకు తీర్మానించారు. రైతుల శ్రేయస్సు, వ్యవసాయ రంగాభివృద్ధికి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని గీతనర్సింహ చెప్పారు. ఏఎంసీ ఆదాయానికి ఎవరు గండి కొట్టే యత్నం చేసినా ఉపేక్షించం అన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు కేశవరెడ్డి, పాండురంగయ్య, అంజయ్య, పి.శ్రీశైలం, పి.జంగయ్య, యు.యాదయ్య, జె.రమేశ్‌గౌడ్, సంపత్‌కుమార్, టి.రవీందర్, అజీం, నరేశ్, వెంకట్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు సన్మానం

కడ్తాల్: ఆమనగల్లు మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డిలను కడ్తాల మాజీ సర్పంచ్ తిరునగరి వేణుగోపాల్, నాయకుడు గూడూరు గోపాల్‌రెడ్డిలు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. రైతుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జహంగీర్‌అలీ, శ్రీకాంత్‌రెడ్డి, ఇమ్రాన్‌బాబ పాల్గొన్నారు.

సమస్యలపై కార్మికుల ఆందోళన



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

శంషాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం భవన నిర్మాణ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేబర్ అడ్డాల దగ్గర మంచినీటి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలనారు. కార్మికుల కోసం ఐదు రూపాయల భోజనం పెట్టాలన్నారు. కార్మికుల బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల కుటుంబాలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుల సెస్సును కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు రామస్వామి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మల్లేష్, ప్రసాద్, చందు, రాములుగౌడ్, మండల కార్యదర్శి ఎన్.గిరి, వెంకటకృష్ణ, నర్సింహ పాల్గొన్నారు.

నాగిళ్ల పాఠశాలలో స్వయం పాలన



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

మాడ్గుల, డిసెంబర్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిళ్ల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. 50 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించారు. తాత్కాలిగా ఉపాధ్యాయులుగా టీచర్ల సాధకబాధకాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు రవీందర్‌రెడ్డి, లక్ష్మి, ఆనంద్, జంగయ్య, లక్ష్మయ్య, పీడి రామకృష్ణ, వేణుగోపాల్, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

ఆమనగల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుందని ఆమనగల్లు ఎస్ఐ బి.వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు పోలీసుస్టేషన్ ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సోను కరాటే అకాడమి నిర్వాహకురాలు సోనుతో కలిసి విద్యార్థినులు ప్రణవి, దీక్షిత, స్రవంతి, పింకి, అరుణ, అస్మిక, హిందూ, పల్లవి, గాయత్రి, నిహారి, జస్వికలను ఎస్ఐ సత్కరించారు. విద్యతో పాటు ప్రతీ విద్యార్థిని కరాటే సాధన చేయాలన్నారు. క్రీడలు శారీరక ధారుడ్యం, మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులను కరాటే పోటీల్లో జాతీయ స్థాయిలో తీసుకుపోతున్న సోను కరాటే మాస్టర్‌ను అభినందించారు.

గదుల నిర్మాణం స్లాబ్‌కే పరిమితం

● పూర్తికాని కార్యాలయ భవనం



అసంపూర్తిగా నిలిచిన వ్యవసాయ శాఖ అదనపు గదుల నిర్మాణ పనులు

ఆమనగల్లు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏ, ఏవో కార్యాలయాలకు సరైన భవనం లేదు. ఏళ్ల కింద నిర్మించిన చిన్న భవనంలోనే రెండు కార్యాలయాలూ కొనసాగుతున్నాయి. ఏడీఏ పరిధిలో ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల మండలాలు కొనసాగుతున్నాయి.సరైన భవనం లేక అధికారులు, పనుల కోసం వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక గదిలో ఏడీఏ, మరో గదిలో ఏవోతో పాటు నలుగురు ఏఈవోలు సిబ్బంది ఉన్నారు. ఇదిలా ఉండగా ఆమనగల్లులోని వ్యవసాయ శాఖ కార్యాలయ అదనపు గది నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. 20ఏళ్ల క్రితం అదనపు గది నిర్మాణాన్ని చేపట్టి కాంట్రాక్టర్ స్లాబ్ పూర్తిచేశాడు. ఆ తర్వాత పనులు నిలిచిపోయాయి. పనులను పూర్తిచేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలని ఏళ్లుగా రైతులు, సిబ్బంది ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందన లేదు. అసంపూర్తి భవనం వినియోగంలోకి రాకుండాపోయింది. అదనపు గదుల నిర్మాణం పూర్తి చేస్తే ఏడీఏ, ఏవో కార్యాలయాలకు సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని నిర్మాణ పనులు పూర్తి చేయించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన భవనాన్ని నిర్మించాలి



ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏ, ఏవో కార్యాలయాలకు నూతన భవనం నిర్మించాలి. సరైన భవనం లేక రైతులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలి. అదనపు గదుల నిర్మాణ పనులు పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలి. అందుకు అవసరమైన నిధుల మంజూరుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

- గంగిశెట్టి మల్లయ్య, రైతు, ఆమనగల్లు

నేటి నుంచి హాస్టళ్లలో కొత్త మెనూ

కేశంపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో శనివారం నుంచి కొత్త మెనూను ప్రభుత్వం ప్రారంభిస్తోందని కేశంపేట మండల ప్రత్యేకాధికారి రాజారత్నం తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం 40శాతం మెస్ చార్జీలు పెంచిందని తెలిపారు. పెంచిన చార్జీల ప్రకారం కొత్త మెనూను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నియమించిన అధికారితో శనివారం కొత్తపేట సంక్షేమ హాస్టల్‌లో నూతన మెనూను ప్రారంభించినట్లు తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, పంచాయతీ అధికారి కిష్టయ్య, హాస్టల్ వార్డెన్ రాధాకృష్ణ, ఏపీఎం భగవంతు, ఏఈవో వినయ్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజారత్నం

క్రైం కార్నర్

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధి రావిర్యాల వండర్‌లా క్రాస్‌రోడ్డు వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డులో శుక్రవారం రాత్రి టిప్పర్ బైక్‌ను ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులిచ్చిన వివరాల ప్రకారం... కొంగరకలాన్‌కు చెందిన శీలం కిరణ్(23) బైక్‌పై కొంగరకలాన్ నుంచి తుక్కుగూడ వైపు వెళ్తుండగా టిప్పర్ ఢీకొట్టింది. దీంతో కిరణ్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

తండ్రి హత్య కేసులో కొడుకుకు జీవిత ఖైదు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తండ్రిపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసిన కేసులో కొడుకుకు జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఎల్బీనగర్ పీడీజే కోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధి తుర్కయంజాల్ ఆరెంజ్ అవెన్యూ కాలనీలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివారాలిలా ఉన్నాయి. తిరుపతి రవీందర్, సుదలు కుటుంబ సభ్యులతో కలిసి తుర్కయాంజాల్ ఆరెంజ్ కాలనీలో నివాసముంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన రవీందర్ కుమారుడు అనురాగ్(25) గంజాయికి అలవాటుపడి డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించేవాడు. 2024 ఏప్రిల్ 4న తండ్రి రవీందర్ ఇంట్లో భోజనం చేస్తున్న సమయంలో అనురాగ్ ఆయనపై పెట్రోల్ పోసి నిప్పంచాడు. దీంతో రవీందర్ ఇంటి బయటకు వచ్చి కుప్పగూలిపోగా బండరాయితో కొట్టి చంపాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టుకు చార్జిషీటు సమర్పించారు. కోర్టు నిందితుడికి జీవిత ఖైదుచ వెయ్యి రూపాయల జరిమానా విధించింది.

నకిలీ ఆధార్‌తో రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తి రిమాండ్

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ ఆధార్ కార్డు సృష్టించి వేరొకరి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ కృష్ణానగర్‌కు చెందిన పిల్లగోని నర్సింహాగౌడ్ ఎన్కెపల్లి పరిధి ఎ-1 గార్డెన్ వెంచర్‌లో 2004లో ప్లాట్ నంబర్ 55, 56లో 455గజాలు జాగా కొన్నాడు. చుట్టూ ప్రహరీ నిర్మించాడు. కాగా కూకట్‌పల్లి చెందిన బొట్టు రఘు 2023లో నర్సింహాగౌడ్ పేరుతో నకిలీ ఆధార్‌కార్డు సృష్టించాడు. పిల్లగోని నర్సింహాగౌడ్ 2004లో ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్‌కార్డు లేదు. దీంతో నర్సింహాగౌడ్ పేరుతో నకిలీ ఆధార్‌సృష్టించి 2023 సెప్టెంబరు 6న నగరానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ మహ్మద్ మజర్ అలీకి చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేశాడు. మజర్ అలీ 2023 సెప్టెంబరు 20న ప్లాట్ ప్రహరీని కూల్చి చదును చేస్తుండగా పిల్లగోని నర్సింహాగౌడ్ అక్కడికి వచ్చాడు. తన ప్లాట్ల ప్రహరీలు ఎందుకు కూల్చారని ప్రశ్నించాడు. తాము రిజిస్ట్రేషన్ చేసుకున్నామని మజర్ చెప్పడంతో పిల్లగోని నర్సింహాగౌడ్ మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నకిలీ ఆధార్ సృష్టించిన కూకట్‌పల్లికి చెందిన బొట్టు రఘును శుక్రవారం పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా అసలు సూత్రధారులను పోలీసులు పట్టుకోవడంలేదని బాధితులంటున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మొత్తం 80మందికి రూ. 34.96లక్షల విలువైన చెక్కులను అందించామన్నారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎ.మధుసూదన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌చైర్మన్ రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాలతి కృష్ణారెడ్డి, డెరెక్టర్లు నరేందర్, జనార్దన్, రాములు, శ్రీనివాస్ గౌడ్, రాజు వివిధ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బడుగులకు మేలు


మాట్లాడుతూన్న కేసరి సంజీవరెడ్డి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేద బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు జరుగుతోందని, ఏడాదిలోనే అనేక సంక్షేమ పథకాలతో బాసటగా నిలిచిందని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసరి సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. పదేళ్లలో బీఆర్ఎస్ పాలనతోనే పోల్చితే తామే మెరుగైన పాలన అందిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు గత 11నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం అసలు, వడ్డీ కలిపి రూ.64వేల కోట్లు చెల్లించినట్లు సంజీవరెడ్డి తెలిపారు. ప్రభుత్వ పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 25ఎకరాల స్థలంలో సమీకృత పాఠశాలల నిర్మాణం చేపడుతోందని. ఇది బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాలు విషం కక్కుతున్నాయని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేయాలని తెలిపారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు దక్కాలి


ఎంపీడీంవోల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిమర్మ ఇండ్లు దక్కేలా సర్వే చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం షాద్‌నగర్‌లోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గ పరిధి ఆరు మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సర్వే చేస్తున్న అధికారులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలిచ్చే సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకొని రికార్డు చేస్తే ఇబ్బందులుండవన్నారు. నిష్పాక్షికంగా సర్వే చేసి నిజమైన అర్హులకే ఇల్లు మంజూరయ్యేలా ఎంపీడీవోలు కృషిచేయాలన్నారు. సమావేశంలో కొందుర్గు కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఫరూఖ్‌నగర్ మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కాగా చేసి పేదలకు న్యాయం చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప అన్నారు. మండల పరిషత్‌లో సర్వేపై కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో అవగాహన సమావేశంలో మాట్లాడారు. సర్వే ఆధారంగానే పేదలకు ఇళ్లు కేటాయిస్తామన్నారు. భూమి లేని నిరుపేదలకు, కార్మికులకు, దివ్యాంగులకు వితంతువులకు, సపాయికార్మికులకు, ట్రాన్స్‌జెండర్లకు, రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ డీఈ వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో శ్రీలత తదితరులున్నారు.

కొత్తూర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పగడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో అరుంధతి అన్నారు. గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఇళ్ల కోసం 4,933 దరఖాస్తులొచ్చాయని తెలిపారు. పీఆర్ ఏఈ జగత్‌చంద్ర ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎంపీవో విజయలక్ష్మీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేవెళ్ల: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సమర్థంగా నిర్వహించాలని ఎంపీడీవో హిమబిందు అన్నారు. మండల పరిష్యత్‌లో సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ.. సర్వేలో తప్పులేకుండా పార్టీలకు అతీతంగా నిర్వహించాలన్నారు. గడువులోగా సర్వేను పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ, కార్యదర్శులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్ అన్నారు. కార్యాలయంలో సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 24 వార్డులకు 24మంది సర్వేయర్లను నియమించి మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ ఇచ్చామన్నారు. మొబైల్ యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలు నమోదుచేయాలన్నారు. సందేహాలుంటే 7675829268, 7989162126 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కేశంపేట: సర్వేపై మండల పంచాయతీ అధికారి కిష్టయ్య, ప్రత్యేకాధికారి రాజారత్నం కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు సర్వే పూర్తిచేయాలని తెలిపారు. దరఖాస్తుదారుల అనుమానాలను నివృత్తి చేసేందుకు మండల పరిషత్‌లో హెల్ప్‌లైన్ నంబర్ 8125209849 ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఫోన్ పనిచేస్తుందన్నారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆమనగల్లు: ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను ఈ నెల 16 నుంచి పరిశీలిస్తామని మున్సిపల్ కమిషనర్ వసంత తెలిపారు. మున్సిపాలిటీలో ఇళ్లకు 4,272 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు వెరిఫికేషన్ కొనసాగుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, రూప్సీశేఖర్, చెన్నకేశవులు, లక్ష్మణ్, యాదమ్మ శ్రీశైలం, జ్యోతినర్సింహ, కృష్ణయాదవ్, దివ్యశ్రీకాంత్, సుజాతరాములు, విక్రమ్‌రెడ్డి, కృష్ణ, సోనిజయరామ్, రాధమ్మవెంకటయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో అపర్ణ అన్నారు. సర్వేపై శిక్షణ నిర్వహించారు. సోమవారం నుంచి సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు కావాల్సిన డాక్యుమెంట్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. మరిన్ని వివరాలకు షాబాద్ ఎంపీవో నంబర్ 9440210453లో సంప్రదించాలన్నారు.


కొత్తూర్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆశాల సమస్యలను పరిష్కరించాలి

శంకర్‌పల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ డిమాండు చేశారు. మండల ఆశా వర్కర్ల నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా శుక్రవారం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా ఆశావర్కర్లకు నెలకు రూ.18 వేలివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ఆశా వర్కర్లపై సవతితల్లి ప్రేమను మానుకోవాలని హితవు పలికారు. ఆశా వర్కర్ల మండల అధ్యక్షురాలిగా నాగమణి, ప్రధాన కార్యదర్శిగా భవాని, కోశాధికారిగా స్వప్న, ఉపాధ్యక్షురాలిగా యాదమ్మ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

ఉద్యమకారుడు జెల్ల సాయిలు మృతి


సాయిలు అంత్యక్రియల్లో పాల్గొన్న నాయకులు

కడ్తాల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): చరికొండకు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నాయకుడు జెల్ల సాయిలు అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. సాయిలు మృతి పట్ల రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి సంతాపం తెలిపారు. సాయిలు మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాయిలు మృతి తీరని లోటు అన్నారు. పరామర్శించిన వారిలో జోగు వీరయ్య, లాల్‌కోట నర్సింహాగౌడ్, రామలుగౌడ్, జంగయ్య, దుర్గయ్య, గోపాల్, లక్ష్మయ్య, యాదయ్య, తదితరులు ఉన్నారు.

మద్దూరి మల్లేష్‌కు భీం భరత్ పరామర్శ

షాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):ప్యాక్స్ వైస్‌చైర్మన్ మల్లేష్ గుండెపోటుతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికొచ్చారు. ఆయనను శుక్రవారం కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీం భరత్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భార్గవరాం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, నాయకులు రవి, సత్యనారాయణ, బుచ్చయ్య, వెంకట్‌రెడ్డి, సురేందర్, కృష్ణయ్య, నర్సింహులు, ప్రవీణ్, నర్సింహులు, సుదర్శన్ పరామర్శించారు.

చదువుతోపాటు యువత క్రీడల్లోనూ రాణించాలి


చేవెళ్ల: సాగర్ కళాశాలలో క్రీడలను ప్రారంభిస్తున్న ఏసీపీ కిషన్

చేవెళ్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): చదువులోపాటు క్రీడల్లో యువత రాణించాలని చేవెళ్ల ఏసీపీ కిషన్ తెలిపారు.శనివారం సాగర్ గ్రూప్ కళాశాలలో ఖేలోత్సవం 2.0ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతు... క్రీడలు మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తాయన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించే పోటీల్లో యువ క్రీడకారులు భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులకు కోసం కళాశాల నిర్వహకులు ఖేలోత్సవం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, కళాశాల డైరెక్టర్ కెవి. రాజు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

కందుకూరు: రెండు రోజులుగా నిర్వహించిన సీఎం కప్-2024 మండల స్థాయి క్రీడలు శుక్రవారం ముగిశాయి. క్రీడల్లో ప్రతిభకనపర్చిన టీమ్‌లకు ఎంఈవో హెచ్ నర్సింహ, నేదునూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసశర్మ, ఎంపీవో గీత బహుమతులను అందజేశారు. వారు మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని కోరారు. అనంతరం మండల స్థాయిలో గెలుపొందిన వారికి బహుమతిని అందజేశారు. కబడ్డీలో ప్రథమ బహుమతిని తిమ్మాపురం, విద్యార్థులకు అందజేశారు. కబడ్డీ బాలికల విభాగంలో కందుకూరు బాలికల పాఠశాల విద్యార్థినులు, వాలీబాల్‌లో మొదటి బహుమతిని పులిమామిడి, ద్వితీయ బహుమతిని కొత్తగూడ, బాలికల విభాగంలో మొదటి బహుమతి తిమ్మాపురం, ద్వితీయ బహుమతి మీర్కాన్‌పేట పాఠశాల విద్యార్థులు గెలుపొందినట్లు తెలిపారు. ఖోఖో పోటీల్లో మొదటి బహుమతి నేదునూరు, ద్వితీయ బహుమతిని మురళీనగర్, పాఠశాలల విద్యార్థులు బాలికల విభాగంలో మొదటి బహుమతి పులిమామిడి, ద్వితీయ బహుమతి కందుకూరు బాలికలు గెలుపొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు అబ్దుల్లా, స్వామి, మల్లేశ్వరి, భాస్కర్, జావిద్, హెచ్‌ఎం విష్ణుప్రియ, నాయకులు అఫ్జల్‌బేగ్, జి.ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

నిస్వార్థ సేవతో ఏసు ఆశీస్సులు : డీపీఆర్వో పీసీ

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిస్వార్థంగా ఎవరైతే దేవునికి సేవ చేస్తారో వారికి ఏసుక్రీస్తు ఆశీస్సులు లభిస్తాయని డీపీఆర్వో పీసీ.వెంకటేశం అన్నారు. హయత్‌నగర్‌లోని బాప్టిస్టు చర్చిలో శరన్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై నిరుపేదలకు చెక్కులు పంపిణీ చేశారు. క్రిస్మస్ పండగకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఏసుక్రీస్తు పుట్టిన పవిత్రమైన రోజున పేదల ప్రజలకు, నిస్సహాయులకు తోచిన విధంగా వస్త్రాలను, ఆర్థిక పరంగా దానధర్మాలు చేస్తే ఏసుప్రభువు అనుగ్రహం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఎం.ఆర్.జాన్, నాగేశ్వర్‌రావు, విజయచంద్, సమంతరాజు, హెబ్సిబా, విమలమ్మ, షారోన్, ప్రవీన్, సైదమ్మ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన లెప్రసీ బృందం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): లెప్రసీ విభాగానికి చెందిన కేంద్ర బృందం శుక్రవారం దండుమైలారం పీహెచ్‌సీని సందర్శించింది. అనుమానిత లెప్రసీ కేసులను పరిశీలించి వైద్యాధికారులకు ఈ బృందం పలు సూచనలు చేసింది. లెప్రసీతో బాధపడుతున్న వారెవరైనా వైద్యులను సంప్రదించాలని ఈ బృందం సూచించింది. ఈ పర్యటనలో కేంద్ర బృందం సభ్యులు డా.హరికృష్ణ, డా.బాలకృష్ణ, డాక్టర్ పాపారావు, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డా.సుధామాదవి, దండుమైలారం వైద్యాధికారి సరిత తదితరులు పాల్గొన్నారు.

గుట్కాలు అమ్మితే కేసులు నమోదు చేస్తాం : ఎస్సై

చేవెళ్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిషేధిత గుట్కా అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్లలో బృందాలుగా పాన్‌షాపులు, టీ కొట్టులు, కిరణాదుకాణాల్లో తనిఖీలు చేశారు. గుట్కాల అమ్మకం నేరమన్నారు. తనఖీల్లో 11పాన్ షాపులు, కిరాణాషాపుల్లో గుట్కాలు, తంబాకు ప్యాకెట్లు లభించాయని, అమ్ముతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

కొన్నది కొంతే!

(5వ పేజీ తరువాయి)

మిల్లర్లు తరుగు పేరిట దోపిడీకి పాల్పడటం వంటి కారణాలతో రైతులు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురాలేదు. వ్యాపారులు ఇళ్లు, పొలాల వద్దకు వచ్చి పచ్చి వడ్లు కొనడం, ఇళ్ల వద్దకు వచ్చి కాంటా వేసుకోవడంతో రైతులకు రవాణా ఖర్చుల భారం తగ్గింది.వ్యాపారులు నేరుగా రైతుల కల్లాల వద్దకే వచ్చి వడ్లను కొన్నారు. వెంటనే డబ్బులు చెల్లించారు. తరుగు తీయలేదు. దీంతో ధాన్యం ఎక్కువ శాతం ప్రైవేట్ పాలైంది.

సేకరించిన ధాన్యం(టన్నుల్లో)	
ఐకేపీ :	462.92
పీఏసీఎస్ :	4,779.72
డీసీఎంఎస్ :	2,068.28
మొత్తం :	**7,310.92**

మద్దతు ధర (రూపాయల్లో)	
సాధారణ రకం :	2,300
గ్రేడ్ ఏ-రకం :	2,320
సన్నాలకు బోనస్ :	500

లక్ష్యానికి దూరంగా..

జిల్లాలో వానాకాలంలో పండిన ధాన్యం కొనుగోళ్లు తుది దశకు చేరుకున్నాయి. 1,38,187 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సాగుకు అనుగుణంగా 40వేల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం జిల్లాలో 42 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఐకేపీ పరిధిలో 3, పీఏసీఎస్ పరిధిలో 31, డీసీఎంఎస్ పరిధిలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 1,504 మంది రైతుల నుంచి 7,310.920 టన్నులు సేకరించారు. గ్రేడ్ ఏ-రకం 7,285.720 టన్నులు, సాధారణ రకం 25.200టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఈ నెలాఖరు వరకు మరో 2వేల టన్నులు రావొచ్చని అంచనా వేస్తున్నారు.

బోనస్‌తో రైతుల ఖుషీ..

సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లించింది. జిల్లాలో కొందరికి బోనస్ డబ్బులు 20వేల నుంచి 30వేల రూపాయలకుపైగా వచ్చాయి. మొత్తం 1,504 మంది రైతులు ధాన్యం అమ్మగా అందులో సన్నరకం ధాన్యం అమ్మిన రైతులు 699మంది ఉన్నారు. బోనస్‌తో రైతులు ఖుషీ అయ్యారు.

మరో రెండు వేల టన్నులు రావొచ్చు



ఈ సీజన్‌లో 40వేల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశాం. కొంత మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని అమ్ముకున్నారు. ఇప్పటి వరకు 7,310.920 మెట్రిక్ టన్నులు కొన్నాం. ఈ నెలాఖరు వరకు మరో 2వేల టన్నుల వరకు ధాన్యం వస్తుందని అంచనా. ధాన్యం అమ్మిన రైతులకు వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం.

- గోపీకృష్ణ, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్

సంక్షిప్తంగా

● **ఆమనగల్లు:** అధైర్యపడొద్దు అండగా ఉంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిరుపేదలు, బాధిత కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకొని ధైర్యం కల్పించాలని కోరారు. అనారోగ్యంతో మృతిచెందిన రాఘాయిపల్లికి చెందిన లక్ష్మమ్మ కుటుంబాన్ని శుక్రవారం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించారు. పీఏసీఎస్ డైరెక్టర్ నాగులు, శంకర్, బాలయ్య, శ్రీను, శ్రీనివాస్, కుమార్ ఉన్నారు.

● **మహేశ్వరం:** ఈ నెల 15న మహేశ్వరంలో కొండేటి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ మల్లయ్య అన్నారు. వైద్య శిబిరంలో స్త్రీ వైద్య నిపుణురాలు సౌమ్య, ప్రమోద్ చికిత్సలు అందిస్తారని తెలిపారు.

● **ఆమనగల్లు:** జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఈ నెల 17న ఆమనగల్లులో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంఘం ఆమనగల్లు యూనిట్ అధ్యక్షుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఆమనగల్లు ఎస్టీయూ భవన్‌లో ఉదయం 10గంటలకు ఆమనగల్లు లయన్స్ క్లబ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మాడ్గుల: అందుగులకు చెందిన రొడంపల్లి లక్ష్మయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద రూ.39వేలు మంజూరయ్యాయి. ప్యాక్స్ డైరెక్టర్ జగన్.. లక్ష్మయ్య భార్య వెంకటమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందచేశారు. నాయకులు రాజు, రమేష్, జంగయ్య పాల్గొన్నారు.

● **శంకర్‌పల్లి:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సిబ్బందికి సహకరించాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కోరారు. మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేను నిర్వహించారు. లబ్ధిదారుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. పట్టణంలో 3,944 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేశారని తెలిపారు. వార్డు అధికారులు, బిల్‌కలెక్టర్లు వచ్చినప్పుడు దరఖాస్తుదారులు సమాచారం ఇవ్వాలన్నారు.

● **షాబాద్:** సీపీఐ దేశంలో ఏర్పడి 2025 డిసెంబరు 26 నాటికి 99ఏళ్లు పూర్తిచేసుకోనుందని, ఈ సందర్భంగా గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి సభలు, సమావేశాలు నిర్వహించి వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య పిలుపునిచ్చారు. షాబాద్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

● **శంషాబాద్ రూరల్:** ఓలా, ఉబర్, ర్యాపిడో లాంటి అగ్రిగేటర్ కంపెనీల అన్యాయ ఆచరణలపై టీజీపీడబ్ల్యూయూ ఉద్యమాన్ని ప్రారంభించింది. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ నాయకత్వంలో అగ్రిగేటర్ సంస్థల ఎయిర్‌పోర్టు ట్రిప్పులను బహిష్కరించేందుకు యూనియన్ ఉద్యమాన్ని ప్రకటించింది. తక్కువ చార్జీలతో డ్రైవర్ల ఉపాధి పోయిందని, ధరలు న్యాయమైన స్థాయికిపెంచే దాకా ఉద్యమిస్తామన్నారు.